# పొంగులేటి, తుమ్మల జిత్తులమారి నక్కలు

- చిన్నయసూరి కథలో కరటక దమనకులు అనే నక్కలు వాళ్లే..
- వారి నటనకు ఆస్కార్ అవార్డులు దక్కినా తక్కువే..
- ఖమ్మం సభలో సీఎం కేసీఆర్ వాళ్లని పోల్చిన విధానం అక్షర సత్యం
- విలేకర్ల సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ‘ ఖమ్మం ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కరటక దమనకులని పరోక్షంగా విమర్శించింది కాంగ్రెస్ పార్టీ నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావునే. కేసీఆర్ ఈ సందర్భంగా చిన్నయసూరి రాసిన కరటక దమనకులనే నీతి కథను ప్రస్తావించారు. ఆ కథ రెండు గుంట నక్కల జిత్తుల గురించి. ఆ నక్కలు తమ నటనతో ఎలాంటి వారినైనా మోసం చేస్తాయి. పొంగులేటి, తుమ్మల కూడా అలాంటి నేతలే. వారి నటనకు ఆస్కార్ అవార్డు ఇచ్చినా తక్కువే. గత ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో పోటీ చేసిన తొమ్మిది మంది బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోవడానికి కారణం వారిద్దరే..’ అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుమ్మల ఎన్నికల్లో గెలవడం కోసం తనను వ్యక్తిగతంగా దూషిస్తూ దిగజారుతున్నారన్నారు. తాను చేపట్టిన అభివృద్ధి పనులను కూడా తుమ్మల తన ఖాతాలో వేసుకోవడానికి యత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో ఒక్కటి నిజమని తేలినా తాను ముక్కు నేలకు రాస్తానన్నారు. తన ఆస్తిపాస్తులను ఖమ్మం ప్రజలకు రాసిస్తానన్నారు. ఈ ఏడాది జనవరి 18న నూతన కలెక్టరేట్ సమీపంలో జరిగిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు భూమి ఈనినట్లుగా జనం వచ్చారని, ఇదే స్థాయిలో ఆదివారం ఖమ్మంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు అలాగే వచ్చారన్నారు. ప్రజలు బారికెడ్లు నెట్టుకుని మరీ సభ లోపలికి వచ్చారన్నారు.

బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉభయ జిల్లా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన రెండు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయన్నారు. కేసీఆర్ ప్రసంగం ప్రజలను ఆలోచింపజేసిందని కొనియాడారు. ప్రజలు 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కేవలం ఎన్నికల సమయంలో ప్రజల మధ్యకు వచ్చే వారిని నమ్మొద్దని పిలుపునిచ్చారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే కొందరు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్నాని మండిపడ్డారు. సమావేశంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ముఖ్యనాయకులు ఆర్జేసీ కృష్ణ, జహీర్ ఆలీ, ఖమర్, తాజుద్దీన్, శీలంశెట్టి వీరభద్రం, ఆకుల మూర్తి, డోకుపర్తి సుబ్బారావు పాల్గొన్నారు.


తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ నీరజ, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ శ్వేత

# బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

**కేసీఆర్ మళ్లీ గెలిస్తేనే ప్రతి కుటుంబానికీ బీమా అందుతుంది**

**కూరగాయల వ్యాపారుల సమావేశంలో ప్రభుత్వ విప్ రేగా**

**ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వంద కుటుంబాలు**

మణుగూరు టౌన్, నవంబర్ 6: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కేసీఆర్ మరోసారి సీఎం కావాలని అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ గెలిపించాలని పిలుపునిచ్చారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే ప్రతి ఇంటికీ బీమా అందుతుందని అన్నారు. మణుగూరు మున్సిపాలిటీలో సోమవారం పర్యటించిన ఆయన.. పట్టణంలోని కూరగాయలు, పూలు, పండ్ల వ్యాపారుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ రేగాను వ్యాపారులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో అమల్లోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకూ మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. ఆసరా పింఛన్ల పెంపు, సన్న బియ్యం పంపిణీ, రూ.400కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15 లక్షలకు పెంపు వంటి పథకాలు నిరుపేదలకు ఎంతో మేలు చేయనున్నాయని అన్నారు. స్థానిక వ్యాపారులకు రోడ్లపై కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వ్యాపారుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్‌తో చర్చించి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆ నిధులతో పట్టణంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నట్లు వివరించారు. రానున్న కాలంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.


ఎమ్మెల్యే రేగాను సన్మానిస్తున్న వ్యాపారులు

### బీఆర్ఎస్‌లోకి వంద కుటుంబాలు..

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, మ్యానిఫెస్టోను గమనించి పట్టణంలోని వంద కుటుంబాల వారు ప్రభుత్వ విప్ రేగా సమక్షంలో ఈ సందర్భంగా బీఆర్ఎస్‌లో చేరారు. కూరగాయలు, పండ్లు, పూల వ్యాపారుల కుటుంబాలకు చెందిన వీరంతా కూరగాయల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఎం.సాగర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లోకి వచ్చారు. వారందరికీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వ్యాపారులు, నాయకులు పీ.నానాజీ, భాస్కర్, అనిల్, రంజిత్, ఉమ, చిలకమ్మ, రాధమ్మ, జయమ్మ, రమాదేవి, గఫూర్, రెడ్డి, వెంకటేశ్వర్లు (పూలకొట్టు),బొలిశెట్టి నవీన్, నూకారపు రమేశ్, ముద్దంగుల కృష్ణ, కుంటా లక్ష్మణ్, సిద్దెల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేగా

# జగన్నాథపురానికి సెంట్రల్ లైటింగ్ తెస్తా

- మళ్లీ గెలిపిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా
- గ్రామంలో అడుగడుగునా ప్రజల నీరాజనం


ఎమ్మెల్యే మెచ్చాకు పూలు చల్లి స్వాగతం పలుకుతున్న మహిళలు, గ్రామస్తులు

ములకలపల్లి, నవంబర్ 6 : తనను మరోసారి గెలిపిస్తే జగన్నాథపురానికి సెంట్రల్ లైటింగ్ తెస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు మాట ఇచ్చారు. మళ్లీ తనను ఆదరిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని అన్నారు. ఆ అభివృద్ధిని గమనించి తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అశ్వారావుపేట మండలంలో సోమవారం విస్తృతంగా పర్యటించిన ఆయన.. పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు, నాయకులు కలిసి ఎమ్మెల్యే మెచ్చాపై పూలవర్షం కురిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండలంలోని పాత గంగారం, ముత్యాలంపాడు, రాచన్నగూడెం, కమలాపురం, సీతాయిగూడెం పంచాయతీల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ప్రచార రథంపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లోనూ బీటీ రోడ్లు, హైలెవల్ వంతెనలు నిర్మించానని వివరించారు. ఇప్పటికే ములకలపల్లికి సెంట్రల్ లైటింగ్ తీసుకొచ్చానని, ప్రభుత్వ ఆసుపత్రికి అదనపు భవనం మంజూరు చేయించానని గుర్తుచేశారు. అన్ని గ్రామాల్లోని అంతర్గత రహదారులనూ సీసీ రోడ్లుగా తీర్చిదిద్దానని వివరించారు. రానున్న ఎన్నికల్లో తనకు అఖండ మెజార్టీ అందించాలని కోరారు. దీంతో ప్రజలంతదరూ ‘జై కేసీఆర్.. జై మెచ్చా.. జైజై బీఆర్ఎస్’ అంటూ నినాదాలు చేస్తూ మద్దతు తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ముత్యాలంపాడులో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మెచ్చా

# తెల్లం వెంకట్రావు నామినేషన్ దాఖలు

**బీఆర్ఎస్ అభ్యర్థితోపాటు అతడి సోదరి కూడా నామపత్రాల అందజేత**

భద్రాచలం, నవంబర్ 6: బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు తన నామినేషన్ ప్రతాలను భద్రాచలంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మంగీలాల్‌కు అందజేశారు. అయితే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోదరి అయిన దుమ్ముగూడెం జడ్పీటీసీ తెల్లం సీతమ్మ కూడా ఒక సెట్ నామపత్రాలను ఆర్వోకు అందజేశారు.



ఆర్డీవో, ఆర్వోకు నామినేషన్ సమర్పిస్తున్న దుమ్ముగూడెం జడ్పీటీసీ తెల్లం సీతమ్మ

### నామినేషన్లకు 10 వరకు గడువు..

ఈ నెల 3న ప్రారంభమైన నామినేష్ల ప్రక్రియ ఈ నెల 10 వరకు కొనసాగనుంది. ఈ నెల 4న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన చర్ల మండలం రైస్‌పేటకు చెందిన పాండ్రు హేమసుందర్ సోమవారం రెండో సెట్ నామినేషన్‌ను సమర్పించారు. కాగా, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య ఈ నెల 9న నామినేషన్ వేసేందుకు ముహూర్తం నిర్ణయించుకున్నారు. బీజేపీ అభ్యర్థి కుంజా ధర్మారావు ఈ నెల 8నే నామినేషన్ వేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం.